విశాలాంధ్ర కృష్ణా జిల్లా

కృష్ణా వర్సిటీలోని వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : నిబంధనలకు విరుద్ధంగా కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకుడు సాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కృష్ణ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణిని కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సాయి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విశ్వవిద్యాలయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, దానిపై ఎన్ని అభ్యంతరాలు వచ్చినా తొలగించలేదని, ఇప్పటికైనా దానిని తొలగించి విశ్వవిద్యాలయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : రాబర్ట్ సన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుట్టాయిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణ దృశ్యం చూపరులను కలచివేసింది. వివరాల్లోకి వెళితే రేపల్లె కొత్తపాలెం కి చెందిన మోపిదేవి రాజేశ్వరి తన భర్త, కుమారునితో కలిసి తాళ్లపాలెం లో జరిగిన శుభకార్యానికి వెళ్లి, మంగళవారం తిరిగి రేపల్లె వెళ్లే క్రమంలో బుట్టాయిపేట దుర్గ మహల్ సమీపంలో బండికి ఉన్న బ్యాగ్ ఇటుకలలోడుతో ఎదురుగా వస్తున్న లారీ హుక్కుకు పట్టి వేయడంతో వెనక కూర్చున్న రాజేశ్వరిరోడ్డుపైపడి, లారీ వెనుకచక్రం ఆమెపై నుండి వెళ్లడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. కుటుంబసభ్యులు ఉండమని బలవంతం చేస్తున్నా, పనిఉంది తొందరగా వెళ్లాలని బయలుదేరి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని ఆమె బంధువులు రోదించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తీసుకుని వెళ్లి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

కొండాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల రాజీనామాలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానమునకు విజయవాడలోని గొల్లపూడి దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనరు వారి ఉత్తర్వులు మేమో నంబర్ K.Dis.No.B2/COE-12021(31)/4/2023, అనుసరించి ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమించబడిన ధర్మకర్తల మండలి చైర్మెన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి, సభ్యులు పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకటరావు, బాడిగ లీలా సౌజన్య, నారేపాలెం వెంకట నిర్మల, డోకాల భాగ్యలక్ష్మి, యార్లగడ్డ పావన, యార్లగడ్డ లక్ష్మి లు వారి వ్యక్తి గత కారణముల వలన అమ్మవారి దేవస్థానము ధర్మకర్తల మండలి చైర్మెన్ పదవి మరియు ధర్మకర్తలమండలి సభ్యత్వమునకు రాజీనామా అమ్మవారి దేవస్థానము కార్యనిర్వహణాధి కారి కానూరి సురేష్ బాబు కు మంగళవారం సమర్పించారు. సదరు రాజీనామాలను అమోదించవలసినదిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనరు వారికి నివేదిక సమర్పించడం జరిగినదని ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ బాబు తెలిపారు.

ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : 2024-25 విద్యాసంవత్సరంలో మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతులను ప్రారంభించారు. ఈ కళాశాలలో మంగళవారం సాయంత్రానికి మొదటి సంవత్సరంలో 107ప్రవేశాలు పొందగా అందులో 78మంది జనరల్ కోర్సులో, 29 మంది వృత్తి విద్య కోర్సులలో జాయిన్ అయినట్లు తెలిపారు. వీరిలో 75 మందికి పైగా సోమవారం నుంచి ప్రారంభమైన తరగతులకు హాజరవుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కే. ఏ. వి. ఎస్ .వి ప్రసాద శాస్త్రి వెల్లడించారు. జనరల్ కోర్సులైన ఎం.పీ.సీ.లో 26, బైపీసీలో 27, సీఈసీలో 22, హెచ్.ఇ.సి.లో ముగ్గురు, వృత్తి విద్యా కోర్సులైన ఏ అండ్ టీలో 14, ఓ ఏ ఎస్ లో 7, ఎం అండ్ ఏటి లో 9మందిజాయిన్ అయ్యారని ప్రసాద శాస్త్రివివరించారు. అలాగే నిడుమోలు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ టు (బాలికలు) లో మొదటి సంవత్సరానికి ఇప్పటికి పది మంది జాయిన్ అయినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చలమలశెట్టి అన్నపూర్ణమ్మ తెలిపారు. ఇంటర్మీడియట్ సెకండియర్ లో 9 మంది ఉండగా వారికిఈనెలఫస్ట్ తారీకు నుంచి తరగతులు ప్రారంభించామని, అలాగే మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా తరగతులు కొనసాగిస్తున్నట్లు ఆమె వివరించారు.

'బడిబాట'లో హైస్కూల్ ఉపాధ్యాయినులు



విశాలాంధ్ర-కూచిపూడి : జిల్లా విద్యాశాఖ ఆదేశాలను సారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పిల్లల కోసం టీచర్లు ఇంటింటికి తిరిగే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కూచిపూడి లోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నెమ్మాని శేష సాయి కుమార్ పర్యవేక్షణలో మహిళా ఉపాధ్యాయులు కూచిపూడిలో క్యాంపెయిన్ నిర్వహించి హైస్కూల్లో కొనసాగే మూడో తరగతి చేరే పిల్లలను గుర్తించారు. కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన నూరు శాతం ట్రైనింగ్ చేసినపోస్ట్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఒత్తిడి లేని చదువు కోసం ఈ నెలలో 13 నుంచి పునః ప్రారంభమయ్యేమాపాఠశాలకే పంపాలని వారికి సూచించారు. ప్రభుత్వం విద్యా కానుకగా ప్రతి విద్యార్థికి రెండుజతలఏకరూప దుస్తులు, టెక్స్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్స్,బెల్టు ఉచితంగా అందజేస్తుందనివివరించారు. ఈ విధంగా ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే పలు సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని పిల్లలను ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు యారా పద్మ (లెక్కలు), డి సుందరమ్మ (తెలుగు), సుమిత (హిందీ), విజయలక్ష్మి (సోషల్), జె కవిత (ఫిజికల్ సైన్స్), డి లక్ష్మి కుమారి (నాచురల్ సైన్స్). పాల్గొన్నారు. కాగా మండలంలోని నిడుమోలు, చినముత్తేవి, భట్లపెనుమర్రు, పెడసనగల్లు, మొవ్వ, కోసూరు,కాజ జిల్లా పరిషత్ హై స్కూల్ తో పాటు పెదముత్తేవి ఎయిడెడ్.హై స్కూల్లో, పెదపూడి, మంత్రి పాలెం, నిడుమోలు(ఉర్దూ) యూపీ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం.!!

నామమాత్రంగా.. కౌలు రైతులకు రుణాలు

భూ యజమాని ఆమోదం తప్పనిసరి

నూతన ప్రభుత్వం పై ఆశ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన 2019 గ్రాఫ్ కల్టివేషన్ రైట్స్ యాక్ట్ కౌలు రైతులకు సమస్యగా మారింది. భూ యజమానుల ఆమోదం ఉంటేనే సాగు ధ్రువీకరణ హక్కు పత్రాలు మంజూరు చేస్తామని నిబంధన వీరికి శాపంగా మారింది. దీంతో జిల్లాలో వ్యవసాయ భూమిలో 70% పైగా పంటలు పండిస్తున్న కౌలు రైతులకు పంటల పెట్టుబడికి కనీస రుణాలు మంజూరు కానీ పరిస్థితి నెలకొంది. అంతేగాక అధిక వడ్డీలకు ప్రవేట్ అప్పులు తీసుకుని నష్టపోవాల్సి వస్తుంది. నూతనంగా ఏర్పాటు అయ్యే ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశతో కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు. కృష్ణా జిల్లాలో 4 లక్షల 27 లక్షల 293 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల ఖరీఫ్ పంటలు సాగు అవుతున్నాయని వ్యవసాయ శాఖ అంచనాగా ఉంది. దీంతో 70% విస్తీర్ణంలో 2.25 లక్షల మంది కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారు . అయితే వ్యవసాయంలో పంటలు పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి సాగు చేయాలన్న ఎకరాకు 40 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పసుపు , కంద, అరటి తదితర రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలంటే లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి అవసరం అవుతోంది . ఈ పంట పెట్టుబడిని సమకూర్చుకోవడం కౌలు రైతులకు భారంగా మారింది. అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్న వీరికి నామమాత్రం గానే పంట రుణాలు అందుతున్నాయి. 2023-24 ఖరీఫ్ సీజన్లో జిల్లాలోని రైతులకు పంటల పెట్టుబడి నిమిత్తం బ్యాంకులు రు 2,994 కోట్ల మేర రుణాలను మంజూరు చేశాయి. అయితే వాస్తవం సాగుదారులైన కౌలు రైతుల్లో నాలుగోవంతు మంది అంటే 52 వేలమంది కి మాత్రమే సాగు ధ్రువీకరణ హక్కు పత్రాలు (సి సి ఆర్ సి) అందడంతో చాలామంది కౌలు రైతులకు రుణాలకు నోచుకోవడం లేదు. అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు కు కేవలం రూ .60 కోట్లు మాత్రమే పంట రుణాలుగా అందాయి. దీంతో అత్యధిక సంఖ్యలోని రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీ లకు అప్పులు తీసుకుని పంటలు పెట్టుబడి సమకూర్చుకోవాల్సి వస్తుంది. బ్యాంకులో నూటికి 50 పైసలకు రుణాలు ఇస్తుంటే ప్రైవేట్ వ్యాపారులు 2 రూ నుండి 4 రూ వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కౌలు రైతుల రెక్కల కష్టం సైతం వడ్డీ వ్యాపారుల చేతిలోకి వెళ్ళిపోతుంది.

కౌలు రైతుకు సమస్యగా మారిన 2019 చట్టం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సర్టిఫికెట్ ఆఫ్ కల్టివేషన్ ను (సాగు ధ్రువీకరణ పత్రాలు, సి ఓ సి లను) అధికారులు మంజూరు చేశారు . వాస్తవ సాగు దారులను గుర్తించి అధికారులు సి ఓ సి లను కౌలు రైతులకు మంజూరు చేసేవారు. వీటి ఆధారంగానే తక్కువ వడ్డీలకు బ్యాంకుల ద్వారా ఎక్కువమంది కౌలు రైతులు రుణాలను తీసుకునేవారు. జిల్లాలోని కౌలు రైతులకు200 కోట్ల నుంచి రూ 250 కోట్లు రుణ ప్రణాళికలో 10 శాతం బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేశాయి . వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో సిసిఆర్సి చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం భూ యజమాని ఆమోదం ఉంటేనే కౌలు రైతు లకు కార్డులు మంజూరు చేయాల్సి ఉంది. దీంతో సిసిఆర్సి లు తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులు రాష్ట్రంలో ఏర్పాటు అయ్యే నూతన ప్రభుత్వం పై ఆశలు పెట్టుకున్నారు . తమకు ప్రయోజనం కలిగే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నారు.

సభా ప్రాంగణం వద్ద పటిష్ట భద్రత : ఎస్పీ

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : విఐపిల భద్రత దృష్ట్యా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి వచ్చేవారు తమ లగేజ్లను వారి వారి వాహనాలలోనే ఉంచుకోవాలని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు. మంగళవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేస్తూ గన్నవరం కేసరపల్లిఐటిపార్క్ వద్ద బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న దృష్ట్యా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఇతర విఐపిలు, రాష్ట్ర నలుమూలల నుండి అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు వస్తున్న దృష్ట్యా ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖుల భద్రత దృష్టిలో ఉంచుకుని, ప్రజలు వారి బ్యాగులను,ఇతర లగేజ్లను,వారు ప్రయాణం చేసి వచ్చిన వాహనాల్లోనే భద్రపరుచుకోవాలని, సభా ప్రాంగణంలోకి ఎటువంటి వస్తువులు తీసుకురావద్దని, ఈ విషయంలో పోలీసు వారికి సహకరించాలని కోరారు.

సీఎం ప్రమాణ స్వీకారానికి భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి అతి సమీపంలో, కేసరపల్లిలో 12వ తేదీన జరగబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏ ఎం సి చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పొట్లూరి బాసవరావు మాట్లాడుతూ.ఎన్ డి ఎ కూటమి బలపరచి భారీ మెజారిటీతో గెలిచిన తెలుగుదేశం పార్టీ అధినేత,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశామనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహెూత్సవం మా గ్రామం అయిన కేసరపల్లిలో,మా స్థలాలలో జరగటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.నాతో పాటు నా తోటి రైతులు కూడా ఈ ప్రమాణ స్వీకార మహెూత్సవానికి పూర్తి సహకారం అందించారని అన్నారు.

తొలివిద్య బాండాగారాలు అంగన్వాడి కేంద్రాలు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- చిన్నారుల తొలివిద్య అంగన్వాడి కేంద్రాల్లో ప్రారంభమై ఉన్నత స్థితికి చేరడానికి ఎంతగానో అంగన్వాడీ కేంద్రాలు దోహదపడుతున్నాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ రేవు నాగలక్ష్మీ అన్నారు .అంగన్వాడి కేంద్రలలో విద్యను అభ్యసించి ఉన్నత చదువులకు వెళుతున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని బంటుమిల్లి గ్రామ ఎస్ టీ ఏరియాలోవున్న అంగన్వాడి కేంద్రంలో మంగళవారం నిర్వహించి గ్రాడ్యుయేషన్ పత్రాలను బంటుమిల్లి ఎంపిటిసి కమల్ బాష, ఐసీడీఎస్ సూపర్వైజర్ రేవు నాగలక్ష్మి చెతులమీదుగా చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి, ఎంపిటిసి కమల్ బాష మాట్లడుతూ చిన్నారులు క్రమశిక్షణతో, ఆటపాటలతో విద్యను అబ్యాసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అంగన్వాడి కేంద్రలలో విద్యను అభ్యసించిన చిన్నరులు పై తరగతులలో మంచి మంచి మార్కులు సంధించి మంచి భవిష్యత్తునూ నిర్మించుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడి కేంద్రలలో చేర్పించి వారి ఉజ్వలభవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని వివరించారు .ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ కృష్ణవేణి, అంగన్వాడి కార్యకర్తలు కె రాణి ,కె సుజాత, బి పి రాజమ్మ, కె కుమారి, బి సువర్ణకుమారి, ఎం డి ఫాతిమున్నీసా, ఆర్ వెంకటరమణ, ఎం డి ముషీరాబేగం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : టిడిపి నేతృత్వంలో ఏర్పడ్డ కూటమి రాష్ట్ర ప్రజలకు వారి సంక్షేమం, వాస్తవిక జీవన ప్రమాణాల అభివృద్ధి గూర్చి శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన రకరకాల హామీల ఫలితంగా అసాధారణ విజయాన్ని సాధించిందని ఈ విజయానికి కారణమైన ప్రజల ఆశల్ని నెరవేర్చాల్సిన బాధ్యత కూడా సహజంగానే చంద్రబాబు నేతృత్వాన ఏర్పడనున్న కొత్త రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షా, ప్రధాన కార్యదర్శులు పి. ప్రసాద్,కె. పోలారి లు అన్నారు.వ ంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనాడు చంద్రబాబు,నేడు జగన్ నేతృత్వాల్లోని ప్రభుత్వాలను రాష్ట్ర ప్రజలు చిత్తుగా ఓడించడానికి అవి ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలు చేసిన ఫలితమే అన్నారు. తిరిగి అదే ప్రజా వ్యతిరేక విధానాలు మరోసారి పునరావృతం కానివ్వకుండా అవసరమైన వత్తిడి తేవడం ప్రజల బాధ్యత అవుతుంది.వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉద్యమ శక్తులది అవుతుంది.అందుకే కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యతాయుత సంస్థగా ఐఎఫ్‌టియు స్పందిస్తుందన్నారు.రాష్ట్ర ప్రజలతో పాటు వారిలో భాగమైన కార్మిక, రైతు, కూలీ, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా రంగాలకిచ్చిన పలు హామీల్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సామాజికంగా అణచివేతకు గురౌతున్న దళిత, ఆదివాసీ, మైనారిటీ, మహిళా రంగాలకి ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు.చంద్రబాబు కూటమి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల్ని ఎట్టి రాజకీయ వివక్షతలకు తావు లేకుండా తక్షణం అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. 76 రకాల షెడ్యూల్ ఎంప్లాయిస్ కార్మికులకు నెలకు 26 వేలకు తగ్గకుండా పెంచుతూ కనీస వేతనాల జీవోలను వెంటనే విడుదల చేయాలి.ప్రభుత్వ రంగాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని వెంటనే క్రమబద్ధీకరణ (రెగ్యులరైజ్) చేయడానికి ప్రయత్నించాలన్నారు.అంగన్వాడి, ఆశా, మిడ్డే మీల్స్ వంటి స్కీమ్ రంగాల ఉద్యోగ, కార్మికులకి గ్రాడ్యుటీ,ఫిఎఫ్,గాడ్యూటీ, పండగ శెలవుల వంటి సౌకర్యాలతో పాటు నెలకు 26 వేల రూపాయిల కనీస వేతనం ప్రకటించి సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలన్నారు.భవన ఇతర నిర్మాణ కార్మికుల బిఓసి బోర్డును పునరుద్ధరించాలి. గత ప్రభుత్వాలు వాడుకున్న బిఓసి నిధులను బోర్డుకు జమ చేయాలి. బోర్డు ద్వారా పథకాలను పునరుద్ధరించి మరింత మెరుగైన రీతిలో అమలు చేయాలి. ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. ప్రతి ఆటో డ్రైవర్ సహా క్యాబ్, లారీ డ్రైవర్లకు ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలి. జీవో 21 రద్దు చేయాలి. సంక్షేమ బోర్డు ద్వారా డ్రైవర్ల కుటుంబాల ఆర్థిక, ఆరోగ్య సమస్యల పరిష్కారాలకు తగు పథకాలు ప్రవేశపెట్టాలి.హమాలీ, ముఠా, జట్టు తదితర అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆచరణాత్మకమైన సంక్షేమ కార్యక్రమాల్ని చేపట్టాలి. వారికి ఉద్యోగ భద్రతతో పాటు చట్టబద్ధ సౌకర్యాలను కూడా కల్పించాలి.ఓపీఎస్ అమలుతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ,ఆర్‌టిసి తదితర ప్రభుత్వ రంగ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన జీతాల చెల్లింపుకి తగు హామీని ఇచ్చి అమలుకు పూనుకోవాలి. ఇప్పటికే ఉపా క్రింద జైళ్లల్లో మగ్గుతున్న వారి విడుదల కోసం పూనుకోవాలి. మన రాష్ట్రంలో ఎన్ఐఎ దాడులను నిరోధించాలి.విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిలిపివేతకు పూనుకోవాలి. గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్ని ఆదానీకి అప్పగించిన గత ప్రభుత్వ ఒప్పందాల్ని రద్దు చేయాలి.ప్రత్యేక హెూదాతో సహా రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్యాకేజీలు, రైల్వే జోన్స్ వంటి రాష్ట్ర విభజన చట్టంలో వున్న అన్ని హామీల అమలు కోసం కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రవిచంద్ర,డి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ముని శంకర్, నాయకులు సీహెచ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నూతనంగా అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు అన్ని భర్తీ చేయాలని ఎం.ఎల్. సి లక్ష్మణరావు కోరారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల యుటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా యుటీఎఫ్ మధ్యాంతార కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న లక్ష్మణరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. త్వరలో కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపధ్యంలో నూతనంగా అధికారంలోనికి వచ్చిన ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వాలకు పిడిఎఫ్ యుటిఎఫ్ తరుపున శుభాకాంక్షలు చెప్పారు. 5 సంవత్సరాలకు ఒక సారి ఎన్నికలు జరుగుతాయని కానీ ప్రజలు, చరిత్ర నిర్మాతలు అనే విషయాన్ని ఈ సారి ఋజువు చేశాయన్నారు. 2019 లో ఓ మార్పు చూశామని 151 సీట్లు ఇచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన ప్రజలకు ఆయన అహంభావం, నిరంకుశత్వం, ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేశారన్నారు. ప్రజాస్వామ్యం లేకపోవడంతో ప్రజలలో అసహనం పెరిగిపోయిందని ఈ నాడు ప్రభుత్వ పతనానికి దారి తీసిందన్నారు. మొట్టమొదటి ప్రభుత్వాన్ని యుటిఎఫ్ నాయకత్వంలో ఉపాధ్యాయులు ఎదిరించారని విజయవాడలో 2022లో జరిగిన ఉద్యమం ప్రభుత్వానికి కనువిప్పు కల్పించిందని, అయినప్పటికి ప్రభుత్వం మొండితనానికి పోయి ఉపాధ్యాయులపై కక్ష్య సాధింపు చర్యలకు పూనుకుందన్నారు. అనేక సందర్భాలలో అనేక ఉద్యమాలు యుటిఎఫ్ చేసినప్పటికి ప్రభుత్వం మాత్రం తన అణచివేత విధానాల ద్వారా ముందుకు సాగనివ్వలేదన్నారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజులు సమ్మెలు నిర్వహించి ఉద్యోగుల నిరసనలు తెలిపారని, నిరంకుశత్వం, అహంభావం జగన్ ఓటమికి కారణాలు అని చెప్పవచ్చన్నారు. కేంద్రంలో అధికారంలోనికి వచ్చిన మోదీ కూడా 400 సీట్లు సాధిస్తామని తన మీడియా ద్వారా ప్రగల్భాలు పలికి అధికారంలోనికి వస్తే రాజ్యాంగాన్ని లౌకికవాదాన్ని మార్చేస్తామని మత విభజనకు పూనుకునేందుకు ప్రకటనలు చేశారన్నారు. ఎగ్జిట్ పోల్స్ సైతం మోదీ కి అనుకూలంగా ప్రకటనలు ఇచ్చినప్పటికి ఆచరణలో సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పడటంతో గతంలో లాగా నియంతృత్వ పోకడలు ఆపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అందువల్ల రాష్ట్రంలో అధికారంలోనికి రాబోయే చంద్రబాబు ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాల విద్యకు ప్రమాధకరంగా మారిన జి.ఓ నెం 117ను తక్షణమే రద్దు చేయాలని అదే విధంగా 3,4,5 తరగతులు విలీనం రద్దు చేయాలని , పాఠశాలలో ఇరువురు ఉపాధ్యాయులను కొనసాగించాలని తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ఎన్నుకునే అవకాశం విద్యార్థులకు కల్పించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎం.ఎల్.ఎస్ బొడ్డు నాగేశ్వరరావు, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, కార్యదర్శి జాన్సీ హుస్సేన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భగీరథి సి హెచ్ రాజగోపాలరావు, టీ చలపతి రావు, వరప్రసాద్ తదితరులు పాల్గోనగా యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు అతిధులను ఆహ్వానించగా మండల శాఖ అధ్యక్షులు వందన సమర్పణ చేశారు. ముందుగా జాతీయ జెండాను, యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించిన అనంతరం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

ముగిసిన వేసవి నాట్య శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య తంగెడ కిషన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, ఓ ఎస్ డి ఆచార్య వి.నిరీక్షణ బాబుల ఆదేశాలతో కూచిపూడిశ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య "కళాపీఠంలో గత నెల 10వ తేదీ నుంచి కూచిపూడి నాట్యం, కర్ణాటక సంగీతంలలో ప్రారంభమైన" వేసవిశిక్షణా తరగతులు "మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆ నాట్యవిద్యార్థినులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాట్య కళా పీఠం ప్రధాన చార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ గానున్న నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపుశ్రీనివాసులుల ఆధ్వర్యంలో ఈ నెల రోజులలో జూనియర్ విభాగంలో 15 మంది విద్యార్థినులకు స్టెప్స్,జతులు, థియరీ లో సంయుత, అసంయుత హస్తముద్రికలునేర్పారు. అలాగే సీనియర్ విభాగంలో 15 మంది విద్యార్థినులకు స్టెప్స్ తో పాటురామదాసుకీర్తన, గణపతి కీర్తన, థియరీలో శిరోభేదాలు, భబేధాలు, దృష్టి భేదాలు, గ్రీవాభేదాలు లో శిక్షణ ఇచ్చారు.టీచింగ్ అసిస్టెంట్(సంగీతం) డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని విద్యార్థినులకు సరళీస్వరాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. నాట్య, సంగీత శిక్షణలకులకు మృదంగంపై టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి సహకరించారు. కళా పీఠం అధ్యాపక బృందం పర్యవేక్షణలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

20 వేల మందికి అన్నదానం



విశాలాంధ్ర-అవనిగడ్డ : 20 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమంలో ఆలయ నిర్వాహణ కమిటీ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 1 వ తేది హనుమాన్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వంతెన సెంటర్‌లో గల ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయ నిర్వాహక కమిటీ ఆద్వర్యంలో ప్రభుత్వ డిగ్రి, జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 20 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలను అందచేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, సింధూరార్చనలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించి 108 పర్యాయాలు హనుమాన్ ఛాలీసా పారాయణం చేశారు. భక్తులు ఈ సందర్భంగా స్వామి వారికి 108 గారెలు, నిమ్మకాయలులతో మాలలతో పాటు వడ, తమలపాకుల మాలలతో అలంకరించారు. మండలం నుండే కాక, దివిసీమ నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ అన్నప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహక కమిటీ స్వయంగా పర్యవేక్షించారు.

బుద్ధ ప్రసాద్‌కు అధికార భాష సంఘం అభినందనలు

విశాలాంధ్ర, విజయవాడ(గాంధీనగర్) : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించిన మాజీ డిప్యూటీ స్పీకర్ మండల బుద్ధ ప్రసాద్ ను రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మహాకవి,సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ మంగళవారం గాంధీనగర్లఓని హోటల్ ఐలాపురంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.నూతన ప్రభుత్వంలో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో తెలుగు భాషను మరింత పరిపుష్టం చేసే విధంగా కృషి చేసేందుకు సహకరించాలని కోరారు.అందుకు బుద్ధ ప్రసాద్ స్పందిస్తూ తెలుగు భాషాభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పంచుమర్తి లక్ష్మీ భీమేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

పాస్‌లు ఉన్నవారికే సీఎం ప్రమాణస్వీకారానికి అనుమతి

- విజయవాడలోని తొమ్మిది ప్రదేశాల్లో ప్రత్యక్ష ప్రసారం
- నగరంలో ట్రాఫిక్ మళ్లింపు - సీపీ రామకృష్ణ వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పాస్‌లు ఉన్నవారికే సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారానికి అనుమతి ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా సీపీ పిహెచ్‌డీ.రామకృష్ణ అన్నారు. బుధవారం కేసరపల్లిలోని చంద్రబాబు ప్రమాణస్వీకారం జరుగుతోందన్నారు. విజయవాడ నుండి ప్రమాణస్వీకారం జరిగే ప్రదేశానికి పాస్‌లు ఉన్న, బస్సులు, కార్లను మాత్రమే అనుమతిస్తారని చెప్పారు. పాస్‌లు లేని ఇతర వాహనాలు అనుమతిలేదన్నారు. ట్రాఫిక్ పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా, తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారని, ప్రశాంత వాతావరణంలో పాసులు కలిగిన ఆహ్వానితులు సభా స్థలానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. విజయవాడలో వాహనాలు మళ్లించడం జరిదిందన్నారు. విజయవాడ నుంచి ఏలూరు, విశాఖపట్నం వైళ్లే వాహనాలు ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బెంజ్‌సర్కిల్ నుండి కంకిపాడు, పామర్రు, హనుమాన్ జంక్షన్, ఏలూరు వైపు మళ్లించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి ఏలూరు వెళ్లే వాహనాలను రామవరప్పాడు ఇన్నరింగ్ రోడ్డు పై మళ్లించారు. గన్నవరంకు చేరుకుంటాయని పేర్కొన్నారు. గొల్లపూడి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి హనుమాన్ జంక్షన్ మళ్లించారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు వీలుగా నగరంలో 20 ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రసారం చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు నగరంలో ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ లను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం సమీపంలోని కేసరిపల్లి ఐటి పార్క్ వద్ద నిర్వహించనున్న చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యేక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్ట్రీమింగ్) కోసం నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం , స్వరాజ్ మైదానం అంబేద్కర్ స్మృతి వనం, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ , లెనిన్ సెంటర్, పటమట జడ్పి హైస్కూల్ రైతు బజార్, సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియం, జింఖానా గ్రౌండ్, విద్యాధర పురం స్టేడియం, పాలి టెక్నిక్ కళాశాల గ్రౌండ్, ప్రసాదంపాడు అన్నపూర్ణ రైస్ మిల్, సూర్య గోడౌన్, ఎస్ ఆర్ కె ఇంజనీరింగ్ కాలేజ్, అను మై బేబీ హాస్పిటల్ ప్రాంతాలలోను, నిడమానూరు బ్లూ బజ్ గ్రౌండ్స్, కెకెఆర్ గౌతమ్ స్కూల్, సవారిగూడెం - కేసరపల్లి మధ్య బహిరంగ ప్రదేశం, కృష్ణలంక రాణిగారి తోట మైదానంలలో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఆయా ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్ల ద్వారా ప్రసారం చేసే ప్రత్యక్ష ప్రసార సౌకర్యాన్ని వినియోగించు కొని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు.

రైళ్ల సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైళ్ల సమయపాలనను అత్యంత ప్రాధాన్యతగా పర్యవేక్షించాలని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్(ఎజిఎం) ఆర్ ధనంజయులు అధికారులను ఆదేశించారు. మంగళవారం డివిజన్‌లోని నెల్లూరు, వెంకటాచలం రోడ్ జంక్షన్, కృష్ణపట్నం పోర్టు,గూడూరు రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు.ముందుగా నెల్లూరు స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనుల పురోగతిని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని,మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, ట్రాఫిక్ సౌకర్యాలు, పొడిగించిన సబ్‌వే పనులను కూడా పరిశీలించారు.అక్కడ నుండి కృష్ణపట్నం పోర్టు, వెంకటాచలం రోడ్ జంక్షన్‌లో ట్రాక్‌ల పరిస్థితి, సిగ్నలింగ్ వ్యవస్థలు, ప్రయాణీకుల సౌకర్యాలు,కార్గో హ్యాండ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో సహా సౌకర్యాలు,సేవలను సమీక్షించారు.ప్రయాణికులకు అవసరమైన మౌళిక సదుపాయాల మెరుగుపరచడానికి ప్రయాణీకులతో మాట్లాడి సూచనలను స్వీకరించారు.భద్రతా ప్రమాణాలను పాటించటంతో పాటు ప్రయాణీకుల సౌకర్యాన్ని పెంపొందించడం,సరుకు రవాణా కార్యకలాపాలలో సామర్థ్యాన్ని పెంచడం వంటి ప్రాముఖ్యతను తప్పనిసరిగా పాటించాలన్నారు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ఈ స్టేషన్లను మరింత అభివృద్ధి చేసేందుకు కొత్త కార్యక్రమాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఈయన వెంట అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) శ్రీనివాసరావు కొండ,డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు,డివిజనల్ ఆరేషన్స్ మేనేజర్ డి. నరేంద్ర వర్మ, సీనియర్ డిఈఎన్(దక్షిణం) కె.డి.ఎస్. కృష్ణ,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం వల్ల నేడు స్కూళ్లకు సెలవు : కలెక్టర్ డిల్లీరావు వెల్లడి

విశాలాంధ్ర- విజయవాడ (వన్‌టౌన్): రేపటి నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నేడు కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం ఉండటంతో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా సెలవు ప్రకటించారు. నగరంలోని, రూరల్ పరిధిలోని సీబీఎస్‌ఈ.,ఐసీఎస్ఈ ఐబీ, ఇతర సెంట్రల్ బోర్డ్ ప్రైవేట్ విద్యా సంస్థలతో సహా అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు. 2024-25 విద్యా సంవత్సరానికి 12వతేదీ బదులుగా అన్ని పాఠశాలలు 13వతేదీ నుండి పాఠశాలలు తిరిగి పున:ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసు కుటుంబాల హృదయాల్లో చంద్రబాబుకు సుస్థిర స్థానం

విశాలాంధ్ర, విజయవాడ(గాంధీనగర్) : సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం తరుపున శుభాకాంక్షలతో పాటు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాము అని సంఘం అధ్యక్షులు జనకుల శ్రీనివాస్ తెలిపారు.మంగళవారం గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పోలీసు కుటుంబాల సంక్షేమానికి కృషిచేసి ఎంతో కృషి చేయటమే కాకుండా పోలీస్ సిబ్బంది ఎదురు చూసిన పదోన్నతులను కల్పించి తమ హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.వైకాపా ప్రభుత్వ హయాంలో తమకు రావలసిన బకాయల కోసం సంవత్సరాలు తరబడి ఎదురు చూసామని ఆవేదన వ్యక్తం చేశారు.11వ పిఆర్సిలో వైకాపా ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బంది పెట్టిందన్నారు. ప్రజలు కూడా వైకాపాకు 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హెూదా కూడా లేకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్ రఘువరన్,కె.నాగిని,ఎం సోమశేఖర్ రెడ్డి,జె.పెద్దయ్య, జి అక్కిరాజు,ఎం సోమయ్య, ఎన్ మోజేష్ పాల్గొన్నారు.

విభజన హామీలు సాధించుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో నూతనంగా చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడనున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా,విభజన హామీలు సాధించుకోవడానికి మంచి అవకాశం లభించిందని వాటిని సాధించి ప్రజల్లో సుస్థిర స్థానం నిలుపుకుంటారని విశ్వసిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నాన్-పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అప్పిగట్ల శ్రీహరి నాయుడు తెలిపారు.మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కేంద్రంలో ఎన్డీఏ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని ఆనాటి విభజన హామీలు, ప్రత్యేక హెూదా కేంద్ర ప్రభుత్వం అమలు చేయవలసిన పథకాలు,రాజధాని నిధులు కేంద్ర ప్రభుత్వం అమలు చేయవలసిన బాధ్యత నూతన ప్రభుత్వం పై ఉందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి తప్పనిసరిగా మద్దతు అవసరమని ఈ మద్దతు ద్వారా అయినా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారని ఎంతో ఆశతో ఉన్నారన్నారు. ప్రధానంగా అనాడు ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక హెూదా, రాజధాని నిధులు, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయటంతో పాటు షెడ్యూల్ 9 ,10,11 లో పొందుపరచిన అన్ని సంస్థలు తక్షణమే నెలకొల్పాలన్నారు.కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న లక్షల ఖాళీల ఉద్యోగాలను భర్తీ చేయడం, ఉత్తరాంధ్ర రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, విభజన అనంతరం రావలసిన వాటాలను నిధులను కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే విడుదల చేయించాలన్నారు.విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు. విటినంటిని చంద్రబాబు నేతృత్వంలో కూటమి కృషి చేస్తుందని ప్రజలు బలంగా నమ్మారని అందుకే ఇంత ఘనవిజయాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షులు వివి ప్రసాద్,జనరల్ సెక్రెటరీ పసుపులేటి వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి వీసం వెంకటేశ్వరరావు, కోశాధికారి దేవరకొండ సురేష్,తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ ఘాతానికి కార్మికుడి మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విద్యుత్ ఘాతానికి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విజయనగం జిల్లాకు చెందిన నీలయ్య వలస కూలిగా వచ్చి పనులు చేస్తున్నాడు. కృష్ణలంక శంకర్ మఠంలైన్‌లో బహుళ అంతస్తుల భవనం నిర్మాణం జరుగుతోందని, అక్కడే కప్ బోర్డు పనులు చేస్తున్నాడు. పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురై కిందపడిపోయాడు. తోటి కార్మికుడు రిక్షాలో నేలయ్యను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ రాష్ట్ర కార్యాలయ బోర్డులు తొలగింపు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి జాతీయ రహ దారి పక్కనే ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర కార్యాలయం బోర్డును మంగ ళవారం తెలుగు యువత నాయకులు తొలగించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్యాలయం పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

విజేతలకు అభినందన

విశాలాంధ్ర-నందిగామ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీలో విజేతలను మాజీ హోమ్ మంత్రి వసంత నాగేశ్వర రావు మంగళవారం అభినందించారు. నగర, పట్టణ ప్రాంత విద్యార్థులతో పోటీపడి జిల్లా లో ప్రథమస్థానం పొందడం ఐతవరం గ్రామానికే గర్వకారణం అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కూడా సైన్స్ సబ్జెక్ట్ నందు రాష్ట్రంలో వసంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచినందుకు అభినందిం చారు. రాబోయే కాలంలో వసంత జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విద్యా పరంగా మరిన్ని అద్భుతాలు చేయా లని వారు ఆకాంక్షించారు. కాగా, పోస్టర్ తయారీ లో జిల్లా ప్రథమ బహుమతి గ్రహీత బత్తుల కావేరి ని, కన్సోలేషన్ బహుమతి పొందిన వరిగల అనుష్కను, పిఎస్ ఉపాధ్యా యుడు గైడ్ టీచర్ బండారు లక్ష్మీనారాయణ ను వసంత అభినందించారు.

కేంద్ర ప్రభుత్వమే ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలను చేపట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): రాష్ట్రంలో ప్రత్యేక నిధుల ద్వారా పోలవరంతో పాటు ఇతర సాగు, త్రాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తి చేసే బాధ్యతలను చేపట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు గౌడ్ కోరారు.మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా బ్యారేజీ నుండి లక్షల క్యూసెక్కుల నీరు సముద్ర గర్భంలో ప్రతి ఏడాది కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది పరివాహ ప్రాంతాలైన జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, నూజివీడు, విజయవాడ ప్రాంతాల్లో తీవ్ర నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా కృష్ణా నదికి ఒకవైపు రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ అవసరాలు దృష్ట్యా నీటి అవసరం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు.ఇటువంటి సమయంలో నీరు వృధా కాకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదికన చెక్ డ్యాములు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేసి రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి సహకరించడంతోపాటు ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఫణీంద్ర కుమార్ సత్య వరప్రకాష్, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మార్పు కోసం విద్యావంతులుగా ఎదగాలి

విశాలాంధ్ర-విజయవాడ : విద్యార్థులు మార్కులు కోసం కాకుండా మార్పు కోసం విద్యావంతులుగా ఎదగాలని, పరీక్షల కోసం కాకుండా విజ్ఞానం కోసం ఉపయోగపడుతోందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(ఐపీఈ) యం.ఎల్.సాయికుమార్ అన్నారు. మంగళవారం సిద్దార్థ కళాశాల ఎంబీఏ విభాగ విద్యార్థులకు 'గూమింగ్ ఫర్ హైరింగ్' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖఅతిథిగా హాజపై ప్రసంగించారు. విద్యార్థులు, యువత తీసుకునే నిర్ణయాలకు వాటి ఫలితాలకు వారే బాధ్యత వహించాలని తెలిపారు. విద్యార్థులు డ్రీమ్ గర్ల్, డ్రీమ్ బాయ్‌గా కాకుండా డ్రీమ్ ఉద్యోగిగా రాణించాలని చెప్పారు. నిరంతర శ్రమతో పాటు పటిష్టమైన ప్రణాళికలలో బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యంలో అవగాహన, నిబద్ధత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ రాజేష్ అధ్యక్షత వహించగా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం తలశిలకి అలవాటే

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : నమ్మిన వారిని నట్టేట ముచ్చడం, తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ కు అలవాటేనని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కళ్లే నాగేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని కృష్ణలంకలో ఉన్న ఒక ప్రైవేటు హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తలసిలా జీవితం పూట గడవలేని స్థితిలో, ఇంట్లో కావలసిన సరుకులు కూడా సమకూర్చలేని విషయం ప్రతి ఒక్క కార్యకర్తకి తెలుసన్నారు. అలాంటి తనను ఉత్తరాంధ్ర టిడిపి ఇన్చార్జిగా ఉన్న బుద్ద వెంకన్నతో కలిసి తిరుగుతున్నానని వేధింపులను నిత్యం గురి చేస్తూ వచ్చాడని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో తన భార్య పేరిట మెడికల్ షాపులు తీసుకుంటే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి దానిని మూయించే ప్రయత్నం తలసీల రఘురాం చేశాడని ఆరోపించారు. కరోనా విపత్కర సమయంలో రోగులకు అందించే పౌష్టికాహార భోజన సరఫరా కాంట్రాక్టును టెండర్లు దక్కించుకుని సరఫరాకు సంబంధించి 29 లక్షల రూపాయల బిల్లుల చెల్లింపులో కూడా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి విడుదల కాకుండా తీవ్ర ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. గతంలో ఎంతో ఉపకారం చేసినప్పటికీ కనీస కృతజ్ఞత కూడా చూపించండి తనను ఆర్థికంగా మానసికంగా ఐదేళ్లపాటు ఎంతో వేధింపులకు గురిచేసాడని ఆరోపించారు. గడిచిన రెండు రోజులుగా వాళ్ల పార్టీ నాయకులు కార్యకర్తలే రఘురాం చేసిన అరాచకాలపై బహిరంగంగా ప్రకటనలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దోచుకోవడం ఆక్రమించుకోవడం నైజంగా కొనసాగుతున్న తలశిల రఘురాం వ్యవహార శైలిపై తాను ఇకనుండి ఒంటరిగా పోరాటం చేస్తానని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో టిడిపి మాజీ కార్పొరేటర్ చందన సురేష్, టిడిపి మాజీ ఫ్లోర్ లీడర్ హరిబాబు పాల్గొన్నారు.

పొన్నూరు ఎంఈఓ రుద్రపాటి శోభా చంద్ సస్పెండ్

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం విద్యాశాఖ అధికారి రుద్రపాటి శోభా చంద్ సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై వాట్సాప్ గ్రూపులో తప్పుడు ప్రచారం చేయడంపై జిల్లా అధికారుల విచారణ చేపట్టారు. వాస్తవమని తేలడంతో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి సస్పెండ్ చేశారు.

CHANGE OF NAME

I, **Mandapati Sri Lakshmi** (Old Name), W/o. Mandapati Brahmam, R/O-#4-177/A, Chandrala Village, Mylavaram Mandal, NTR Dt.,A.P. I have Changed my name as **Mandapati Bhagya Lakhsmi** (New Name) Hereafter my name is known as **MANDAPATI BHAGYA LAKSHMI**

ఏపీఈఏపీ సెట్‌లో శ్రీచైతన్య విద్యార్థికి ఉత్తమ ర్యాంకులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఏపీఈఏపీ సెట్‌లో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు విజయవాడ చుట్టుగుంట శ్రీచైతన్య కళాశాల డీన్ హరిబాబు తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్‌లో చదువుతున్న పరిశా వర్షిణికి 799 ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. బి.ప్రియాంక 1791 ర్యాంకు సాధించారని తెలిపారు. నవనీత్ 4641, 5వేల లోపు ర్యాంకులు ఐదుగురు విద్యార్థులు దక్కాయన్నారు. కళాశాలలో అసోసియేట్ డీన్ షేక్.నాగూర్ మీరావలి, ప్రిన్సిపాల్ ఎన్.గోకర్ణేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నీలిమ, కళాశాల సిబ్బంది ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మిక్‌లో బ్లాక్ చైన్ టెక్నాలజీపై అవగాహన

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చైన్ అను అంశంపై ఆల్గోరాండ్ సంస్థ సహకారంతో మంగళ వారం సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆల్గోరాండ్ సంస్థ టెక్నికల్ లీడ్ డాక్టర్ నిఖిల్ వర్మ విద్యార్థులకు బ్లాక్ చైన్ టెక్నాలజీ యొక్క ప్రాముఖ్యత, భవిష్యత్తులో ప్రయోజనాలు,విద్యార్థుల కు లభించే ఉపాది అవకాశాల గురించి వివరించారు.అంతేకాకుండా ఆల్గోరాండ్ భారత్ సంస్థ రీజనల్ అంబాసిడర్ ఆకాష్ రావు మల్లారెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రముఖ ఎన్జీవో నాస్కామ్ ఈ బ్లాక్ చైన్ సర్టిఫికేషన్ కోర్సు ఉచితం గా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.ఈ సర్టిఫికెట్ కోర్స్ వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించవచ్చని ఆకాష్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి పాండురంగారావు, మేనేజ్మెంట్ నెంబర్ ఎం.సుహాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ. వంశీ కిరణ్, ఐటీ విభాగ అధిపతి ఏ. అనురాధ, మెంటర్ మహంతి,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమా జ్యువెలర్స్ కొత్త వెడ్డింగ్ కలెక్షన్ కహానీ - బ్రైడల్ స్టోరీస్

విశాలాంధ్ర విజయవాడ (వన్ టౌన్): నమ్మకం, నాణ్యతకు పర్యాయపదంగా నిలిచిన భీమా జ్యువెలర్స్, తమ సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్, 'కహానీ - బ్రైడల్ స్టోరీస్ పై ఆవిష్కరించింది. పేరుకు తగినట్లుగా, ఈ కలెక్షన్ లో ప్రతి ఆభరణం ఒక ప్రత్యేకమైన కథను చెబుతుంది. ప్రయాణాన్ని వివరిస్తూ, తమ ప్రత్యేక రోజున సమకాలీన వధువుల అవసరాలను తీరుస్తుంది. అసమానమైన హస్తకళా నైపుణ్యం, సూక్ష్మ అంశాల పట్ల కూడా చూపే నిశిత శ్రద్ధకు, భీమా యొక్క అచంచలమైన నిబద్ధతకు ఈ సున్నితమైన కలెక్షన్ నిదర్శనంగా నిలుస్తుంది. ప్రతి వధువు మరపురాని ప్రకాశంతో ప్రకాశించేలా చేస్తుంది. ఆమె ధరించిన ఆభరణాల వల్లే ఆమె ప్రయాణాన్ని చిరస్మరణీయం చేస్తుంది. ఈ కలెక్షన్ లో అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నెక్లెస్లు, మిరుమిట్లు గొలిపే చెవిపోగులు, సొగసైన గాజులతో సహా సూక్ష్మంగా రూపొందించిన ఆభరణాల శ్రేణిని కలిగి ఉంది.

సరికొత్త జాతీయ మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించిన క్షేమ జనరల్ ఇన్సూరెన్స్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా పంటల బీమాపై అవగాహన పెంచే లక్ష్యంతో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తమ జాతీయ మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సమగ్ర ప్రచారంలో ప్రధాన అంశం టీవీ ప్రచారం. ఇది రుతుపవనాల ప్రారంభంతో రైతులు విత్తడం ప్రారంభించిన వేళ వారికి చేరుతుంది. ప్రింట్, డిజిటల్, అవుట్‌డోర్ మీడియాలో ఏకకాలంలో చేసే ప్రచారం ద్వారా ఈ టీవీ ప్రచారం మరింతగా రైతులకు చేరుతుంది. విపరీతమైన వాతావరణ సంఘటనలు తరచుగా ఎదురుకావడంతో పాటుగా అవి తీవ్రమవుతున్న వేళ రైతులకు ఆర్థిక భద్రతా వలయాన్ని రూపొందించడంలో పంట బీమా యొక్క ప్రాముఖ్యతను ఈ ప్రచారం వెల్లడిస్తుంది.

ప్రకటన

నా క్లయింటు అయిన యస్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, రామకృష్ణాపురం, ఆర్.ఆర్.దబ్ల్యు. నెం.554 వాస్తవ్యులు లేటు షేక్ యూసఫ్ గారి కుమారుడు షేక్ నాగూర్ వలి గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... నా క్లయింటు ది.04-06-2024 న తన పూర్వీకుల తాలూకు విజయవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సందు దస్తావేజు నెం. 4256/1960 గా ది.12-12-1960న రిజిష్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజు తీసుకొని కృష్ణాజిల్లా మూలపాడు గ్రామం నుండి విజయవాడ వైపుకు మోటార్ సైకిల్ పై వస్తూ యన్.టి.ఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం వద్ద ఫొటోస్టాట్ తీయించు నిమిత్తమై ఆగి చూసుకొనగా సదరు ఒరిజినల్ దస్తావేజు మరియు మరికొన్ని కాగితములు కనబడలేదు. నా క్లయింటు దారిపొడుగునా వెదికినా దొరకలేదు. కావున సదరు డాక్యుమెంట్లు ఎవరికైనను దొరికిన యెడల ఈ దిగువ తెల్పిన అడ్రస్‌కు స్వయముగా కానీ రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని అందచేయుగలరు. సదరు దస్తావేజులు దొరికిన వారు వాటిని నా క్లయింటు యొక్క హక్కులకు వ్యతిరేకముగా ఉపయోగించిన యెడల నా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బద్ధులగుదురని, అట్టి లావాదేవీలు నా క్లయింటును బైండ్ చేయజాలవని ఇందు మూలముగా తెలియజేయుటమైనది.

యస్.బాలాజీ, న్యాయవాది
డోర్ నెం.26-20-21ఎ, స్వామి స్ట్రీట్,
గాంధీనగర్, విజయవాడ-3.
ఫోన్.8333864459